# వ్యర్థత్యాగం

చలపతిరావుగారు అనుకోకుండా కన్పించారు ఇన్నాళ్లకు - పదేండ్ల తర్వాత ఈనాడు కన్పించారు. వారిని చూడంగానే నేను ఆశ్చర్యపడ్డాను.

మనిషిలో గుర్తుపట్టలేని మార్పు రావడం ఎంత చిత్రంగా ఉంటుందో పది పదిహేను ఏండ్ల తర్వాత కూడా ఏ చిన్న మార్పూ లేక పోవడము కూడా అంతే చిత్రమనిపిస్తుంది.

అదే స్వరూపం - అదే వేషం.

ఆ ఖద్దరు లాల్చీయే - ఆ ముతక ధోవతే!

మీసకట్టూ అల్లాగే ఉంది.

ఆ నిండుతనం ఇంకా నిల్చే ఉన్నది.

భుజాన వేసుకొనే గుడ్డ సంచీ రంగు మారిందికాని మాదిరి అదే. ఆ వ్యక్తిలో ఎక్కడా ఒక చిన్న మార్పైనా లేదు. అయితే మరీ పరీక్షగా చూస్తే - అదీ మొదటి నుండీ వారి నెరిగిన వారు మాత్రమే - వారి వయస్సు పట్టుకోగలరేమో.

నన్ను చూడంగానే చిరునవ్వుతో పల్కరించారు "ఏం తమ్ముడూ క్షేమమా!" అని.

నేను వారివంకే నిదానంగా చూస్తూ - లోనకలిగిన ఆనందాన్ని ఆశ్చర్యాన్నీ లోలోనే అణచివేసుకోవాలన్న యత్నంతో మరల చిరునవ్వు నవ్వుతూ "ఆ. ఆ." అని మాత్రమే అనగలిగాను.

ఆరోజు పట్నం నుండి వస్తూ బెజవాడ స్టేషనులో బండి ఆగంగానే దిగివెళ్ళి కాఫీ అదీ సేవించి మళ్ళీ మళ్ళీ దిగవలసిన అవసరం కలుగకుండా ఫ్లాస్కు నిండా కాఫీ పోయించుకొనివచ్చి నా బెర్తుపై ఒకమూలగా పెట్టుకొని క్రిందకు దిగి ప్లాటుఫారంమీద నిలబడి ఉన్నాను. అప్పుడే ఆయన కన్పించారు. వారూ మరొక పెట్టెలో నుండి దిగి వస్తున్నారు.

వారు కన్పించంగానే ముందుకు వెళ్ళి నమస్కారం చేశాను. వారు నా క్షేమాన్ని పరామర్శించారు.

"ఎక్కణ్ణించండీ రావడం అన్నగారూ?" అని అడిగాను నేను.

"ఇంటిదగ్గర నుంచేనయ్యా"

అయితే ఇటు ఎక్కడిదాకా.

"నాస్తేరు వెళదామని బయలుదేరాం"

అహా అల్లాగా నేనూ అక్కడికేనండి" అన్నాను నేను.

అన్నగారు కూడా వస్తున్నందుకు నాకు చాలా ఆనందమయ్యింది.

"అయితే అన్నగారూ రండి - అభ్యంతరం చెప్పకండి ఇద్దరం కలిసి కూర్చుందాం మా పెట్టెలోనే సరే మామూలేగా సామానేమీ లేదుగా" అన్నాను మరచిపోయిన చనువును జ్ఞాపకం చేసుకొంటూ.

వారు ఒక్క క్షణం ఆలోచనలో దిగబడ్డారు. నేను కొంత ధైర్యం చేసి "రండన్నగారూ రండి." అని చెయ్యి పుచ్చుకొని ముందుకు నడువబోయాను.

"అవునయ్యా... కాని ఈసారి సామాను చాలా ఉంది - ఆడవాళ్ళతో ప్రయాణమయ్యె!"

"అయితే ఇంకేం వదినగారూ వస్తున్నారా పదండి వాళ్లనూ తీసుకొనివద్దాం." అని ముందుకు పోవడానికి ఉద్యుక్తుణ్ణి అయ్యాను. కాని వారు అక్కడే ఆగి నిలబడిపోయారు.

## "మురయా"

"అబ్బే ఎందుకు లేవయ్యా అవన్నీ కదపడం శ్రమ" అన్నారాయన.

నాకు తెలుసును వారిలో వచ్చే చిక్కు. వారు సెకండుక్లాసులో ఎక్కరు. సొమ్ము నేను ఇచ్చుకొంటానండీ అన్నా. ఆయన అంగీకరించరు. ఈ విషయంలో నేను క్రితంలో చాలాసార్లే ప్రయత్నంచేసి ఓడిపోయాను.

"సరే ఆ సంగతి తర్వాత చూద్దాం - ముందు పదండి వదినగార్ని చూస్తాను" అని ముందుకు నడిచాను వారూ నా వెంట వచ్చారు.

ఆవిడను నేనసలు గుర్తుపట్టలేకపోయాను. నాకు జ్ఞాపకం ఉన్న వ్యక్తికీ ఈ వ్యక్తికీ అసలు - ఏ కోశానా పోలికే లేదనిపించింది. ఎంత మనిషి - రథంలాగా - లావుగా - ఎత్తుగా ఠీవిగా ఉండేది. మనిషి పచ్చని పసిమి. ముఖంలో ఎంత వర్చస్సు!- మాటలో ఎంత ముచ్చట! హృదయంలో ఎంత ప్రేమ! ఎంత చాకిరి చేసేది. అర్ధరాత్రివేళ అనుకోకుండా హఠాత్తుగా పదిమంది వచ్చిపడ్డా - ఒక్క రవ్వకూడా విసుక్కోకుండా కూరా నారా చేసి వడ్డించి మరీ పిల్చేది భోజనాలకు. ఎవరు వచ్చినా ఎంతో ఆదరించి అన్నం పెట్టేది.

అల్లాంటి మనిషి ఇల్లా అయిపోయిందంటే - చూచి నేను ఆశ్చర్యపడ్డానంటే అబ్బురమేమీ లేదు. నా ఆశ్చర్యం మరుక్షణంలో జాలిగా మారిపోయింది.

నా హృదయం జాలితో నిండిపోయింది.

అంతలో నాకు కోపంవచ్చింది. అవును నిజంగానే మా అన్నగారిమీదే కోపం వచ్చింది. ఆవిడ ఏదో బాగా జబ్బుపడి ఉండాలి. ఊరికే చుట్టపుచూపులా వచ్చి పోయే దగ్గూ పడిశెమో చిన్న జ్వరమో - అల్లాంటి జబ్బుకాదు చాలకాలంగా తిష్ట వేసుకొని కూర్చున్న జబ్బే అయివుండాలి. దీనికంతటికీ అసలు కారణం ఆ - నిస్సందేహంగా అన్నగారి అశ్రద్ధే అయివుండాలి.

ఆవిడ ఆ మెయిల్లో జనసమర్ధంగా ఉన్న మూడవతరగతి పెట్టెలో ఒదిగి ప్రక్కగా - కిటికీకి ప్రక్కగా కూర్చుని ఉంది. నేను లోపలకు వెళ్లి ఎదురుగా చోటు చేసుకొని కూర్చుంటూ - అదేమండీ వదినగారూ ఇల్లా అయిపోయారూ!" అన్నాను దిగులుగా.

"అబ్బే! ఏం లేదయ్యా - కొన్నాళ్ళ నుండి ఒంట్లో ఏమీ బాగా వుండటం లేదు."

"కారణం?"

"అనారోగ్యమే" అన్నదావిడ నాకు మనస్థైర్యాన్ని చేకూర్చడానికేమో అన్నట్లుగా ఓ చిరునవ్వుతో తేల్చేస్తూ.

ఆవిడను ఇంకా దూరం ప్రశ్నించినా ప్రయోజనం లేదని అనుకొని చివరకు ఇల్లా అన్నాను.

"అయితే ఇంతకాలం నాకో ఉత్తరం ముక్క వ్రాయించాలనే అనుకోలేదన్నమాట. అన్నగారు వ్రాయలేరంటే కారణాలుండవచ్చు. మీరు వ్రాయడానికేమండీ? అని ఆవిడ సమాధానం ఎల్లాగో ఇవ్వదని గ్రహించి కొంచెం చిరాకుపడుతూ క్రిందకు దిగివచ్చాను వచ్చి అన్నగారి ప్రక్కనే నిలబడ్డాను. నాకు వారు కన్పించిన ఘడియ నుండీ ఒక అనుమానం బాధిస్తూనే ఉన్నది. వారికి నాపై క్రితంలో కలిగినభావం తొలగిపోయిందా లేదా అని. కాని ఆ విషయమై ప్రశ్న వేయడం నిజంగా పిచ్చగా ఉంటుంది.

అందుకని ఆ ప్రసక్తి తీసుకొనిరాకుండా "ఏమండీ పిల్లలు క్షేమంగా ఉన్నారా?" అని అడిగాను.

"ఆ. ఆ. ఇంటివద్దే ఉంచివచ్చాను." అన్నారాయన.

ఆయనకు సంతానం కొంత ఆలస్యంగా

# ★ వ్యర్ధ త్యాగం ★

కలిగింది. నేను చూచినప్పుడు ఒక పిల్లవాడూ - ఒక ఆడపిల్లా. ఆపిల్లకే పదేళ్లు దాటిఉండాలి. అన్నగారికి పిల్లలంటే ఎంతో ఆపేక్ష. ఎవరిపిల్లలైనాసరే ఎత్తుకొని ముద్దాడేవారు. ఆరోజుల్లో రైల్లో పోతూ - ఎవరిపిల్లవాడో దేనికోసమో ఏడుస్తూ - మారాంచేస్తూ తల్లిని వేధిస్తుంటే వారు వెళ్ళి వాణ్ణి తనదగ్గరకు తీసుకొని సముదాయించి తనవద్దే ఉంచుకొనేవారు - తనో వాళ్లో దిగి వెళ్లేవరకూ.

పిల్లలుఏడుస్తుంటేచూచి ఓర్చలేరాయన. వారి హృదయం చాలా మెత్తనిది.

మనిషి కొంచెం మోటుగా రాటుతేలిన వాడిలా కన్పించినా ఆయన ఇతరులకు ఏకష్టంవచ్చినా ఓర్చుకొనేవారు కాదు - తనకు కలిగే కష్టనిష్ఠురాలని అధికంగా సహనంతో ఓర్చుకోగలిగికూడా.

కేవలం పూర్వాచారపరాయణుల కుటుంబంలో జన్మించినా ఆయనకా ఆచారాలు పట్టనేలేదు. పదిఎకరాలమాగాణీ - నీవు పట్టించుకొన్నా పట్టించుకోకపోయినా మీ కుటుంబాన్నే అంటిపెట్టుకొని ఉంటామంటూ ఉంటూవచ్చినని క్షేపమైనభూమి - ఈయన హయాంలో క్రమంగా కరిగి ఖర్చయిపోయింది.

ఏదో జల్సాకోసం సొమ్ము తగలబడిపోతే వారిమీద నాకు ఏసానుభూతీ ఉండకపొయ్యేను.

అల్లాకాక మాకోసం - నాలాంటివాళ్ళ కోసం ఖర్చుపెట్టారు.

ఔదార్యం మెచ్చుకోదగిన గుణవిశేషమేగాని దానికైనా హద్దూ పద్దూ ఉండాలి; కాస్త వెనకా ముందూ చూచుకోవాలి.

అబ్బే! అన్నగారికీవిషయంలో అసలేమీ తెలియదనేచెప్పుకోవాలి. ఆయనతో నాకు ఇరవైసంవత్సరాలు - నిండా రెండు పుష్కరాలనుండీ స్నేహం.

మొదటిసారిగా మా యిద్దరికీ జైల్లో పరిచయమయ్యింది. అది నేను మొట్టమొదటిసారిగా ఉద్యమంలో జైలుకువెళ్లినరోజులు.

ఉడుకు రక్తంతో హృదయం ఉప్పొంగిపోతున్న దినాలవి. మే మిద్దరమూ చెరో జిల్లానుండీ వచ్చి ఆ జైల్లో కలుసుకొన్నాము.

వారు అప్పట్లో నన్నెంతో ఆకర్షించారు.

జైల్లో భగవద్గీత చదివి వినిపిస్తూ ఉండేవారు. మనదేశపు గ్రామాలను గురించీ - ఖద్దరు పరిశ్రమను గూర్చి చెబుతుంటే మేమంతా వినేవాళ్ళం. ఆయన స్వయంగా వార్ధాలో ఆరేళ్లపాటు వుండి రావడంచేత ఆయా సిద్ధాంతాలను చక్కగా చెప్పకలిగేవారు. మాకు అడపా తడపా కలుగుతుండే అనుమానాలను తీర్చేవారు. నేను ఇంటిపట్టున ఉండి తిని తిరిగేవాణ్ణి కావడంచేత నాకా వార్డు వాతావరణం - అక్కడి భోజనం సరిపడలేదు. కొద్దిరోజులకే చాలా అధైర్యపడ్డాను. వయస్సులోనా చిన్నవాణ్ణి - పైగా అనుభవమూ అంతకన్నా లేదు.

వారే నన్ను దగ్గర కూర్చోబెట్టుకొని "తమ్ముడూ ఇంతమాత్రానికే దిగులుపడితే - నువ్వు ఉద్యమానికేం పనికివస్తావయ్యా - కాస్త నిబ్బరంగా ఉండాలి" అంటూ ధైర్యం చెప్పేవారు. ఒకరోజున వారి స్వవిషయమేదో చెబుతూ - "చూశావ్ తమ్ముడూ నేను వచ్చేటప్పుడు మా అమ్మకు చాలా జబ్బుగాఉంది. నేను ఉండి మందూ మాకూ ఇప్పిస్తే తప్ప మరోదారి లేదు. అయినా ఆవిడను అల్లా వదిలేసి పిలుపు రాంగానే వచ్చేశాను. నేనేమైనా అధైర్యపడుతున్నానూ? అదీకాక నీ విషయంలో అల్లాంటి ఇబ్బందేమీ లేదాయె ఇహ ఎటొచ్చీ వాళ్ళిచ్చే ఆహారం విషయమేగా నీకు ఇబ్బందిగా ఉన్నదీ! అయితే ఒక్కటి చూడూ - కోపగించుకోక మనం తిండి కోసం కాదుగా ఇక్కడకు వచ్చిందీ!" అన్నారాయన.

ఆమాటకు నిజంగానే నాకు కోపం వచ్చింది. తనకేం అల్లాగే చెబుతారనిపించింది. అక్కడ ఇంటిదగ్గరైనా మహా తిన్నవాడైతే నేగా! అనుకొన్నమాట వాస్తవమే. కాని తర్వాత తెలిసింది వారి మాటలో ఉన్న నిజం. నిజం తెలిసిన తర్వాత వారిపై మంచి గురుభావం ఏర్పడింది. వార్ని చూచి మరీ ఆశ్చర్యపడింది ఎప్పుడంటే...

ఈయన ఇక్కడ జైల్లోఉండగా అక్కడ ఇంటివద్ద తల్లికి జబ్బు ఎక్కువై కొంతకాలం చాలా బాధపడి చనిపోయింది. భర్తృవిహీనయైన ఆతల్లికి అంత్యక్రియలు జరిపించే అవకాశమైనా వారికి లభ్యంకాలేదు. ఆవార్త తెచ్చిన ఉత్తరం మాజైలు సూపరెంటుకు సకాలంలో చేరినా వారికి మాత్రం కావాలని ఆలస్యంగా అందచేయబడింది. అది చూచి మేమంతా విచారపడ్డాం.

వారుమాత్రం తొణకలేదు, బెణకలేదు. ఆదివమల్లా ఉపవాసంచేసి మౌనవ్రతం వహించారు. ఆరాత్రల్లా జాగారంచేస్తూ గీతాపారాయణం చేశారు.

ఆఘట్టమే నన్ను చకితుణ్ణిచేసి వారికి మరింత సన్నిహితంగా - దగ్గరగా తీసికొనిపోయింది. వ్యక్తిగతమైన - లోక సహజమైన ప్రేమల్నీ - ఆపేక్షలనూ ఒక ఆదర్శ సాధనకై వారు ఏనాడో బలిపెట్టేశారని గ్రహించాను. అటువంటి నిబ్బరం కల మనిషిదగ్గరే ఉండి మంచిఅనుభవం - శిక్షణా సంపాదిద్దామని అనుకొన్నాను.

కాని నాకా అవకాశం లభించలేదు. ఇంటిదగ్గర మావాళ్ల ప్రయత్న ఫలితంగా - జరిమానాలు చెల్లించివేసిన ఫలితంగా... ఇతరకారణాల మూలకంగా నన్ను ఆ జైలునుంచి మరోజైలుకుమార్చి 'బి' క్లాసులో వేశారు. అన్నగారిని అక్కడే 'సి' క్లాసులో వదిలివచ్చేశాను. అదృష్టమనేది అన్నిచోట్లా ఉంటుంది.

చివరకు ఆజైళ్ళల్లో కూడా ఉన్నది. నాకాజైలు మార్పు మంచికే వచ్చింది. కాస్త పెద్దవాళ్ళతో పరిచయాలయినాయి.

కాని నాకు అక్కడా సరిపడలేదు. నాఆరోగ్యం కొంత చెడింది. అతి ప్రయత్నం మీద ఆరునెలల తర్వాత చెర విడిపించుకొని బయటకు వచ్చాను. నేను వచ్చిన రెండేళ్ళకు అన్నగారూ ఆయన మిత్రులూ బయటకు వచ్చారు. వారెవరూ జరిమానా ఒక్కపైసా అయినా జమకట్టకపోవడంచేత అంత ఆలస్యమైంది. నేను విడిచివచ్చిన జైల్లో అన్నగారి మూలకంగా కొన్ని ఇబ్బందులు కలిగాయట. వారు ఆ జైలుసూపరెంటును రూల్సుప్రకారంగా ధర్మంగా నడచుకోమని కోరారట. దాంతో ఆ అధికారికి ఆగ్రహంవచ్చి వారిపై క్రోధం వహించి మరోసమయంలో ఏదో చిన్న




కొత్తగా ప్రవేశపెట్టబడినవి

అందము, పటిష్టముగల ఉక్కు కుర్చీలు సరసమైన వెలలో కొనుటకు మమ్ము సంప్రదించండి.

వివరములకు నేడే వ్రాయండి :

లల్లూరాం అండ్ కో,

వెలగలేటివారి వీధి, :: విజయవాడ - 1.

"కాంతి షోరూమ్. మారుతి సినిమా కెదురుగా".

సరా చూచుకొని వారిని లాఠీతో కొట్టి ంగ్లీషులో తిట్టి అవమానపరచి పైకి "ఇతడు ప్రభుత్వాధికారులకు అవిధేయుడై ప్రవర్తిస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నాడు" అని వ్రాశాడట.

దాంతో వారిని అక్కడనుంచి రాయివెల్లూరు. రాయివెల్లూరునుంచి బళ్లారి. బళ్లారి నుండి మా కెవరికీ పేర్లయినా తెలియని ఉత్తరప్రాంతాలకూ పంపారట.

వారు జైలునుంచి తిరిగి రాగానే వెళ్ళి చూచాను. ఆయా జైళ్ళల్లో వారిని చాలా బాధపెట్టారట.

వెంటనున్న వాళ్లు చెబుతూంటే నాకళ్ళల్లో నీళ్లు తిరిగాయి ఆ అధికారులు అన్నగారిబొమికయితే విరగగొట్టలేదుకాని కండలనుమాత్రం కరిగించివేశారు. అల్లాఅయి వచ్చిన వ్యక్తినిచూచేసరికి మగవాడ్ని నేనే నిలువునా నీరైతే మా వదినగారు భోరున ఏడ్చిందంటే విచిత్రం ఏమీ లేదు.

ఆయన ఒక్క మొగాలు వేసుకొని కూర్చున్న మమ్మల్నీ - గుండె బాదుకొంటున్న భార్యనూ చూసి నవ్వుతూ "ఊరుకోండర్రా - అంత పిరికివాళ్లయ్యారేమర్రా - నా కోసం అంతదిగులా - నాకేం - నిక్షేపంలా ఉంటే" అంటూ ఏదో చెప్పుకుపోయారు.

వారిమాటలు నాకేమాత్రం ధైర్యాన్ని ఇవ్వకపోయేసరికి చివరకు ఆయన ఇల్లా అన్నారు.

"ఓయ్ తమ్ముడూ - నేను ఆరునెలల్లో పూర్వంలా కాకపోతే ఉద్యమనుండి విరమిస్తానయ్యా సరేనా?"

నేనప్పుడు వదినగారిని అతికష్టంమీద ధైర్యంచెప్పి ఊరుకోబెట్టాను.

చూచిపోదామని వచ్చిన నేను వారింట్లో చాలాకాలం ఉండిపోయాను.

ఆశ్చర్యమేమంటే ఆయన అన్నట్లుగానే సరిగా ఆరునెలల్లోనే ఆరోగ్యవంతులయ్యారు.

అది నాకు చాలా చిత్రమనిపించింది. వచ్చినప్పటినుంచీ ఒక్కరోజైనా వారు విశ్రాంతి తీసికొన్నదిలేదు.

మూసివేసిన హిందీపాఠశాల తిరిగి తెరిచారు. జిల్లా అంతా తిరిగి ఖాదీ ప్రచారం చేశారు. మమ్మల్నందరినీ వెంటవేసుకొని గ్రామాలకుపోయి మాలగూడాలను పరిశుభ్రం చేయడం రాత్రిళ్లు గ్రామజనులను ఒకదగ్గరకుచేర్చి వాళ్లకు విషయాలు విశదపరచడం - ఇల్లాగా ఎన్నో పనులు మళ్ళీ మొదలు పెట్టారు. తనఊళ్లో మునిసిపాలిటీ వ్యవహారాల్లో జోక్యం కలుగజేసికొని


కుటుంబానికి అనుకూలమైన ప్యాకెట్‌లో నున్న

# 'అనాసిన్'

కొనండి.




ప్రతి పర్యాయము 32 మాత్రల 'అనాసిన్' ప్యాకెట్ కొనుటవల్ల మీరు 4 అణాలను ఆదా చేసుకొనెదరు. ఈ ప్యాకెట్, ఎల్లప్పుడు చేతిలో సిద్ధంగా 'అనాసిన్'ను ఉంచుకొనవలెనను కుటుంబముల కొరకు ప్రత్యేకంగా ఉద్దేశించబడినది. ఎందుకంటే ఇది బాధనుండి శీఘ్రవిముక్తికి 4 మందులను కలిగియున్నది.

1. క్వినైన్: అధికశక్తి నిచ్చు ఔషధమని మరియు జ్వరనివారిణి యని ప్రఖ్యాతి గాంచిన ఔషధసమ్మేళనం. జ్వరాన్ని తగ్గించడంలో పాటిలేనిది.
2. కఫీన్: బలహీనానికి మరియు చిక్కిపోయినందుకు తగిన ఔషధమని విరివిగా వాడబడుతున్నది.
3. ఫినాసిన్: తీవ్రమైన బాధా నివారిణి మరియు జ్వర నివారిణి యని ఖ్యాతి చెందినది.
4. అసిటైల్ సాలిసిలిక్ ఆసిడ్: ఇది తలనొప్పి, మరియు అలాటి వివిధ బాధలను పోగొట్టుటకు ఉపయోగపడుచున్నది.

'అనాసిన్' లోని యీ నాలుగు మందులు, బాధ, తలనొప్పి, జలుబు, పన్ను నొప్పి మరియు కండరాల నొప్పులనుండి శీఘ్రంగా సురక్షితమైన మరియు దీర్ఘమైన విముక్తిని కలిగించుటకు పరమ ముఖ్య స్థానములందు తీవ్రమైన మిశ్రమ చర్యను జరుపును.

'అనాసిన్' 2 మాత్రల ప్యాకెట్లలో కూడ దొరకును.

ఎల్లప్పుడును **అనాసిన్** బిళ్లలే కావలెనని కోరండి

# ★ వ్యర్థ త్యాగం ★

ప్రజోపయోగకరమైన పనులు జరిగేటట్లు ఏర్పాట్లుచేశారు. వారికో క్షణం తీరికే లేదు!

అందువల్లనే నేనొకసారి వారితో "ఏమండీ అన్నగారూ - మీకీ ఆరోగ్యం ఎల్లా వచ్చిందండీ - కాస్తయినా విశ్రాంతి లేకుండా ఇల్లా తిరుగుతున్నారే! ఏమిటీ చిత్రం - ఎక్కడ ఉందీ రహస్యం" అని అడిగాను.

"అల్లా అడిగావు బావుంది - చూశావూ - ఎక్కడ వాళ్లు మన స్వేచ్ఛను అరికట్టారు. బయటకు రాగానే స్వేచ్ఛ లభించింది. స్వేచ్ఛవలన పుష్కలంగా ఆరోగ్యం లభించింది నాలాగే నాతల్లికూడా సంపూర్ణమైన స్వాతంత్ర్యం పొందగానే మంచి ఆరోగ్యవంతురాలవుతుంది." అన్నారు.

వారి మాటలు నా హృదయానికి హత్తుకొన్నాయి. అంతకుముందు దేశానికి స్వేచ్ఛ కావాలి - వచ్చి తీరాలి అన్నమాటలు పదే పదే విన్నాను. ఇప్పుడు ఎందుకు రావాలో వారి ద్వారా విన్నాను. నన్నంతగా ఆకర్షించిన అన్నగారింట్లోనే ఉండి అనేక విషయాలు నేర్చుకొన్నాను. హిందీ నేర్చాను. అప్పట్లో నేనేకాదు నాలాగే చాలామంది వారి ఆతిథ్యాన్ని ప్రతినిత్యం అందుకొని ఉండిపోయారు.

అల్లాగా వారితో - వారింట్లోనే ఉండి వారిచేత "తమ్ముడూ" అని పిలిపించుకొంటూ వారి ప్రేమ వృక్షపునీడల్లో పెరిగి అన్నగారికి ఆత్మీయుణ్ని అయ్యాను.

ఆ తరువాత జరిగిన వ్యక్తి సత్యాగ్రహంలో మేమంతా జైళ్ళకు పోయి వచ్చాం.

అదంతా సాదాగా శాస్త్రరీత్యా జరిగింది.

అయితే ఒక చిన్న తేడా ఉంది వారికీ నాకూ. వారు ఆ గ్రామంలోనే చేస్తే నేను మరికొందరు మిత్రులతో పాటు బస్తీకిపోయి నలుగురి సమక్షంలోనూ కొంత అట్టహాసంగా 'అరెస్ట'యి వెళ్లాను.

నేను పదినెలల తర్వాత తిరిగి వచ్చాను.

తిరిగివచ్చిన కొద్ది కాలానికే ఆగస్టు వ్యవహారాలు సంభవించాయి.

నేను వయస్సులో చిన్నవాణ్ని కావడంచేత వారి అనుమతి లేకుండానే మరీ ముందుకు వెళ్లాను. నాకంటె చిన్నవాళ్లతో చేతులు కలిపాను. కొన్ని పనులు జరిగాయి. వాటికి నేను బాధ్యుణ్నే. అది పైవారికి తేలికగా తెలిసింది. అన్వేషణ సాగించారు. నేను తప్పించుకొని తిరిగాను. నాకూ అన్నగారికీ ఉన్న సంబంధం అందరికీ తెలిసినదే. అది ప్రభుత్వంవారికీ తెలియటం ఏమంత కష్టమైన విషయం కాదు. వారు జైలునుండి తిరిగివచ్చిన రోజులకే క్రొత్త చిక్కుల్లో పడ్డారు. నేనొక అర్ధరాత్రివేళ వెళ్లి వారిని చూచివచ్చాను. మరొకరాత్రి వారు వచ్చి వారిని లారీలో ఎక్కించుకొని తాలూకా దాటించి ఠాణాకు తీసికొనిపోయారు.

ఠాణాలో వారు నా ఆచూకీ చెప్పమని అన్నగారిని మంచిగా కోరారు. వారు చెప్పలేదు.

ఎన్ని చెప్పినా వారు చెప్పనేలేదు.

అప్పటున్న సర్కిలు చాలా కరుకు మనిషి.

అన్నగారిదగ్గరనుండే ఆవార్త రాబట్టాలని అతను విశ్వప్రయత్నం చేశాడు. తిట్టాడు భయపెట్టాడు. చివరకు చేతకాక చెయి చేసుకొన్నాడు - ఎన్ని చేసినా లాభం లేకపోయింది. అటునుంచి అటే వారిని జైలుకు పంపారు. ఎక్కడకు ఎటు తీసికొనిపోయారో నాకేకాదు మా జిల్లావారి కెవరికీ తెలియలేదు.

ఆ ఉద్యమానికి "ఆగస్టు అల్లరులు" అని నామకరణం చేశారు ఏలెడివారు. దానికి సంబంధించిన భోగట్టా కొంత వారి దగ్గర విడిచి నేను తప్పించుకొని తిరిగాను. ఆ కాగితాలూ అవి వారు నాయందున్న ప్రేమవలన పరులకందకుండా దాచారు. వారు నా ఆచూకీ చెప్పేస్తే వారికా బాధతప్పేది. కాని నాయందున్న ప్రేమ ఆపేక్షవలన చెప్పలేదు. నిజమే బయటపడితే నాకు 'సి' క్లాసు కాదు మరేదో శిక్ష వేశేవారు. కాని అల్లా జరుగలేదు. ఆతరువాత కొన్ని నెలలకు నన్ను పట్టుకొనిపోయినా పెద్దమనిషిని తీసికొనివెళ్లినట్లు తీసికొని వెళ్లారు.

మా ఉద్యమాలఫలితంగానే అనండి. ప్రపంచపరిస్థితుల్లో కలిగిన మార్పులఫలితంగా అనండి - మొత్తంమీద పరాయి ప్రభుత్వంవారు దేశాన్ని విడచిపోక తప్పింది కాదు.

ఎన్నికలు వచ్చాయి. మా ప్రాంతంనుండి అన్నగారు ఎన్నికయి వెళతారని నేను నిజంగా ఆశించాను. కాని మా కమిటీవారు ఏ కారణంవల్లనో వారి పేరుకాక మరో పేరు సూచించారు. నేను పరుగునవెళ్లి అన్నగారితో ఆవిషయం చెప్పి 'రండి ప్రయత్నం చేద్దాం' అన్నాను. వారు ససేమిరా రానన్నారు.

వారు అలా అన్నాక నేను వెళ్ళి నా ప్రయత్నాలు నేను చేసుకొన్నాను. పోటీలు పడి నా ప్రజ్ఞను ఉపయోగించుకొని నా పేరు జాబితాలో వేయించుకొన్నాను. ఆపని అయిన తర్వాత అన్నగారిదగ్గరకు వచ్చి వారి సంపూర్ణ సహకారాన్ని అభ్యర్థించాను. వారు అంగీకరించి సహకరించారు.

వారు నాతరపున చేసిన ప్రయత్నం అమోఘమైంది. ఇంటింటికీ వెళ్ళి చెప్పి వచ్చారు. మొత్తం ఆప్రాంతం అంతా మావైపు మొగ్గేటట్లు చేశారు. మా సంస్థనూ దాని తరఫున నన్ను గెలిపించారు. అల్లాగా నేను అధికారంలోకి వెళ్లాను.

అల్లాగా నేనూ మరికొందరం మిత్రులమూ అధికారంలోకి వెళ్లాము. కాని అన్నగారు మాత్రం అక్కడే వెనకే ఉండిపోయారు.

ఆయన అప్పుడే కాదు ఆ తర్వాతకూడా ఏ పదవిలోకీ రాకుండా ఉండిపోయారు. జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ అధ్యక్ష పదవులకు ఎన్నికలూ పంచాయితీ ఎన్నికలూ ఇల్లాగే ఎన్నో వచ్చాయి. వాటిల్లో దేనికో దానికి వారిని నిలబెట్టి గెలిపించాలని నేను తాపత్రయపడ్డాను. ఆయన దేనికీ ఒప్పుకోలేదు.

వారు తిరిగి తమ నిర్మాణకార్యక్రమంలో మునిగిపోయారు. హిందీ ప్రచారం - ఖాదీ పరిశ్రమ - గ్రామ పునరుద్ధరణ - ఇవే ఆయన పనులు.

సర్వమూ అయిపోయేదాకా త్యాగాన్ని మానుకోలేదు. ఉన్న ఆస్తినీ తన అమూల్యమైన కాలాన్నీ చివరదాకా త్యాగం చేస్తూనే ఉన్నారు.

ఇక దానికి అవధి ఏమిటో - దాని ఆశయమేమిటో అల్పజ్ఞుణ్నైన నాకు అంతుపట్టలేదు. అంతా పోయింది ఇక ఎల్లాగా వారికి! అని నేను విచారపడ్డాను కాని వారికా ఆలోచనే రాలేదు.

నేను మంచి పదవిలో ఉన్నాను కదా అన్నగారు వచ్చి నన్ను అభినందిస్తారనీ - ఏవైనా పనులు చేసిపెట్టమని అడుగుతారనీ సహజంగానే ఆశించాను. అల్లాగయినా వారి ఋణం తీర్చుకొందామని అత్యాశకుపోయిన మాటా వాస్తవమే.

కాని వారు నన్ను అల్లా వచ్చి చూడనే లేదు. పోనీ ఏపనులమీదా మనుష్యుల్ని పంపనూ లేదు. ఆ తర్వాత నేను వారిని చూడటం పడలేదు. నేనే స్వయంగా వెళ్లడానికి కొన్ని విషయాలు అడ్డువచ్చాయి.

నామీద కొన్ని అపవాదులు వచ్చాయి. నేనేదో సంపాదిస్తున్నానని అన్నగారిదాకా వెళ్లింది. వారు నమ్మరనుకొన్నాను, కాని వారు ఎవరో చెప్పినమాటలు నమ్మి - నమ్మడమేకాక ఆరాలు తీయించి... చివరకు నాయందు అత్యంత వైముఖ్యాన్ని వహించి - తన నిరసనభావాన్ని బహిరంగంగా కొందరిముందు వ్యక్తపరిచారు.

ఆత్మీయులమైన తర్వాత నిజానిజాలా కావలసింది?

కాని వారల్లా అనుకోలేదు. తనకు ధర్మమని తోచింది అనేశారు. అయినా నేను ఆమాట వినికూడా పట్టించుకోలేదు. పెద్దవారులే ఏదో అన్నారని ఊరుకొన్నాను.

వారిస్థితి అంతా తెలుసుకొని వారికి తోడ్పడాలనే వారికో బట్టల లైసెన్సు తన కొళ్ళవద్దకు పంపాను. అది మరొకరికి ఇచ్చుకొన్నా కొంతవచ్చును; కాని నిరాకరించారు.

విసిరి నా మొహాన కొట్టారనిఅనిపించింది. బాధపడ్డాను - కాని సహించాను.

అదేకాక ఆవిధంగా వారికి ఎన్ని విధాల అవకాశాలు కలుగజేసినా వారు అందుకో లేదు. పైగా నామీద కోపం వచ్చింది. ఆకోపం నాటికొనాడు పెచ్చు పెరిగింది. ఆవిషయం తెలిసే వార్ని చూడటానికి నేను స్వయంగా వెళ్ళలేకపోయాను.

అన్నగారి సౌమ్యతిని - వారివల్ల పైకి వచ్చి వార్ని ఆదరించలేదని - కృతజ్ఞత లేని వాడిననీ నన్ను కొందరు ఆడిపోసుకొన్నారు; వారిమాటలు అన్యాయమనిపించింది.

లోపాలు ఉండవచ్చు మనిషి అన్నాక ఏదో ఒక లోపం - ఒకానొకస్థితిలో కన్పింపవచ్చు. అంతమాత్రం చేత గతాన్ని అంతా విస్మరించి అన్నగారల్లా ప్రవర్తించడం నాకేమాత్రం సహజంగా కన్పించలేదు.

రాజకీయాలమూలకంగా బాధపడ్డవాళ్ళకు కొత్త పొలం ఫ్రీగా ఇచ్చే ఏర్పాటు చేసింది మా ప్రభుత్వం. మేమూ తలా కొంత పుచ్చుకొన్నాం. ఎక్కడెక్కడవాళ్ళో వచ్చి మా సహాయాన్ని అందుకొని మమ్మలను అభినందించి వెళ్ళారు. కాని అన్నగారు దరఖాస్తు అయినా పెట్టలేదు. దరఖాస్తు వస్తుందేమో సాయంచేద్దామని అనుకొన్నాను. కాని అల్లా కాలేదు.

అన్నగారికి నా స్వాభిమానాన్ని చంపుకొని మనిషిచేత కబురంపాను.

వెళ్ళిన మనిషి అవమానితుడై వచ్చాడు.

"నాకు భరణంఇస్తారటయ్యా - వాళ్ళేమో అసలు సిద్ధాంతాలు మర్చిపోతారూ - మా వద్దకేరారూ" అని ఏమో అన్నారట.

అంతే దాంతో మా యిద్దరికీ చెడింది. మనసు విరిగాక మరల కలవడం కష్టం వారి విషయంలో అంతే జరిగింది. రెండవసారి ఎన్నికలు వచ్చాయి. నాకేదో భయమైంది. చివరకు నాభయం నిజమైంది.

కారణాలు ఏవైతే నేం నేను ఓడిపోయాను. వారు మరో అభ్యర్థికి సాయం చేశారు. వారికి ఇంకా అంత ఓపిక మిగిలి ఉందని గానీ - పలుకుబడి ఇంకా నిలచి ఉందనిగానీ నే నూహించుకోపోవడం కూడా ఒక కారణమే కావచ్చు.

వారికి నామీద విరోధభావమే ఏర్పడింది. అయితే నేనేమీ పగ సాధించలేదు. మరోకజిల్లాకుపోయి అక్కడ బైఎలక్షనులో కేంద్రానికి పోటీచేసి ఆస్థానాన్ని గెలుచుకొన్నాను.

అల్లాగా నేను అభివృద్ధిలోకి వచ్చాను. కొంత పలుకుబడీ సంపాదించుకొన్నాను. నా యోగ్యతలనూ - నా పూర్వజన్మకృత పుణ్యాన్నీ నాకార్యాన్ని అన్నీ చూసుకొని లక్ష్మీదేవి నన్ను వరించింది. అందుకు ఎవరో ఈర్ష్య వహించారనిగానీ - ఏదో అనుకుంటున్నారనిగానీ విన్నా నేను లక్ష్యపెట్టనేలేదు. ఈగడచిన పదేళ్ళలో అన్నగారు - అదే మా చలపతిరావుగారు నాకు కన్పించనేలేదు. ఆ అవసరం నాకేమో కలుగలేదుకదా వారికైనా కలుగుతుందేమో అనుకొన్నాను కాని అల్లాంటిదేమీ జరగలేదు.

ఇన్నాళ్ళకు కన్పించారు.

కలకాలం పాతవిషయాలు జ్ఞాపకం ఉంచుకొని పగపట్టి బుసకొట్టే విషసర్పపు బుద్ధికాదు గనుక నేనే ముందుకువెళ్ళి అన్నగారిని పలకరించాను. నమస్కరించాను. ఆయన కన్పింపకపోయినా నేను వారియందు వైముఖ్యాన్ని ఏనాడూ వహించలేదు. మారైతులు ఏదో పనులమీద వచ్చి మాటల సందర్భంలో అన్నగారినిగూర్చి ఏమో చెబుతుండేవారు "ఆయన నిజంగా ఎసుమంటిమడిసండీ - ముడిసిపాలీకి నాయుడుగారి పేర్టికి ఎగస్టుపేర్టిగా నిలుసుండారు. ఆయనే వచ్చి పదిమేలిత్తా మానుకోమంటే - ససేమిరా ఇనుకోలాయి ఆయనకు ఏలుచేదయినా-తింటానికి లేకపోయినా."

అల్లా వారు చెప్పినప్పుడల్లా నేను విని హర్షించాను. నేనూ ప్రశంసించాను. వారిని సమర్థించి వారి తత్వాన్ని విడబరచి చెప్పి వారి త్యాగశీలత నుగ్గడించాను.

వారు పడుతున్న ఇబ్బందులూ విన్నాను. ఒకసారి బొంబాయినుండి ఒక చిన్నవాడు వారింటికివచ్చి వారిని గౌరవించి - అన్నగారి స్థితిని పూర్వాపరాలు రెండూ తెలిసికొని చాలా విచారపడి వారికి రెండుజతల పంచలు పాదాభివందనంచేసి బలవంతపెట్టి ఇచ్చి వెళ్ళాడట అదీ విన్నాను.

ఇంతకంటే అన్యాయం ఏమన్నా వుందా! బాగాఉన్న రోజుల్లో ఆయన ఎంతమందికి వస్త్రదానం చేశారూ - అసలు వారి నడిగవలసిన అవసరం లేకుండానే వారింట్లోంచి వెళ్ళేటప్పుడు నూత్న వస్త్రాలు వారింట్లోవి తీసి కట్టుకొని నవ్వుతూ సంతోషంగా వెళ్ళారో! - వారికీ - వారికే స్థితి వచ్చింది. ఇంత తెలుగుదేశం ఉంటే - ఇంతమంది అయినవాళ్ళం ఉంటే - ఎవరో పరాయి వ్యక్తివచ్చి ఔదార్యం చూపి పోవలసివచ్చింది. ఈ విషయం విన్నాక నా కళ్ళలో నీళ్లు తిరిగాయి అంటే ఎవరు నమ్ముతారు.

తప్పు కొంత నాదే కావచ్చు. నిజమే. కాని మిగతావాళ్ళంతా ఏమయ్యారు. కారణాలు ఏవో వారికి తోచాయి కనుక నేను సహాయంచేసినా వారు పుచ్చుకోరు. కాని మిగతా దేశం అంతా ఏమైంది?

ఇది నాకే అంతుపట్టనిది మరొకరికి అంతుతుందనిగాని వారిని ఆదుకొంటారనీ నేను అనుకోనూ అనుకోను - నేనల్లా ఆశించినా జరగనూ జరగదు.

తనకు ప్రభుత్వంవారు వారికి వార్తే ఏమో చేస్తారని ఆయనా ఏనాడూ భావించనూ లేదు - తన కిది కావాలని అభ్యర్థించనూ లేదు. వారిని జైళ్ళలో హింసించిన వార్లల్లో కొందరు ఉన్నత పదవులకు పోయారు. కొందరు పింఛను పుచ్చుకొని సుఖంగా కూర్చున్నారు. మా ఊళ్లో ఆగస్టు దినాల్లో అన్నగారిని లాఠీలతో అన్యాయంగా కొట్టి వీపుమీద శాశ్వతమైన గుర్తులు పెట్టిన అధికారి ఇప్పుడు పెద్ద అధికారి కూడా కాబోతున్నాడు.

పరాయివాళ్ళను యుద్ధసమయంలో చదువు సంధ్యలేమీ ఆట్టే రాకపోయినా దుబాసీగా పనిచేసి సైనికుల్ని పంపి... తెల్ల ప్రభుత్వానికి తోడ్పడిన మా కృష్ణయ్య ఈనాడు రావుబహద్దర్ శ్రీ వేంకట కృష్ణయ్యఅయిలక్ష రూపాయిలకుఅధికారియై ఇప్పుడు స్వదేశీమంత్రులనూ అల్లాంటివారినీ తనకార్లల్లో వేసుకొని త్రిప్పుతున్నాడు. మేమంతా...ఉడుతభక్తిచూపిన మేమంతా మా సేవకూ త్యాగానికీ అనేక రెట్లఫలితాల్ని అందుకొన్నాము.

అందుకు ఒకరిని అని ఏమీ ప్రయోజనం లేదు. ఇదంతా కాలప్రభావం.

కాని, అన్నగారుమాత్రం తనకున్న ఆస్తి అన్నిటికంటే ముఖ్యమైన ఆరోగ్యం - అందరూకోరే సర్వసామాన్యమైన జీవిత సౌఖ్యాలూ, విశ్రాంతీ - అన్నీ త్యజించి అందుకు ఫలితంగా...చివరకు రాగిపాత్రను పాణితలాన్న అలంకరించుకొన్నారు. అయ్యో ఎంత నిస్వార్థం.

ఆ విషయం తలచుకొన్నప్పుడల్లా నా మానసవీధిలో నల్లనిమబ్బులు కమ్ముకొంటాయి. నాబాధ ఎవరికీ తెలియదు. ఈ విషయంలో నాతప్పులేదని చెప్పినా ఒప్పుకోరు. తప్పుకోడానికి ఏదో అన్నానంటారు. ఎవరిదాకానో ఎందుకు మొన్న మా అమ్మ అన్నది.

"ఒరేయి అబ్బాయి - మన చలపతిరావు చాలా ఇబ్బందిపడుతున్నాడటరా. నువ్వు కాస్త వెళ్లి ఆదుకోరాదటరా? అబ్బే నువ్వాయన కెందుకు చేస్తావ్ సాయం! నీ కొడుక్కు చేసుకొంటావ్. కాక క్రొత్తగా దొరికిన అల్లుడికి చేసుకొంటావ్!" అని నిష్ఠూరాలాడింది.

నిజం ఎవరికి తెలుస్తుంది! నాబాధ ఎల్లా చెప్పుకోగలను. ఈ బాధతో నే వారి త్యాగశీలతను ఎల్లా మెచ్చుకొని విడబరచి చెప్పగలనూ! * * *

# ★ వ్యర్థత్యాగం ★

ఆయన ఇన్నాళ్ళకు అల్లాగా ఈ తప్త హృదయునకు కన్పించగానే నా మనసు ఆనందమగ్నమూ - హర్షపులకితమూ అయిందంటే మా యిద్దరికీమధ్య అంతచరిత్రఉంది.

ఆయన నన్ను పూర్వంలాగా ప్రేమతో "తమ్ముడూ" అంటూ పలకరించగానే నా హృదయంలో ఎక్కడో దాగిఉన్న ఆ కాస్త కోపమూ పోయింది. నిజంగా సంతోషించాను. వదినగారిని చూచాక నాకు పట్టరానంత దుఃఖం పొంగివచ్చింది. ఈసారి ఏమైనా సరే వారికి ఏదో సాయం చేయాలని సంకల్పించుకొన్నాను.

అందువల్లనే ఆయన రానంటే నేనే వెళ్లి వాళ్లు కూర్చున్న పెట్టలో కూర్చున్నాను.

ఇద్దరం హృదయాలు విప్పి మాటాడుకొన్నాం. దారిలో వారు చాలా విషయాలు చెప్పారు. చాలా ప్రశాంతంగా నెమ్మదిగా మాటాడారు. ఎక్కడా ఆవేశంగానీ ఆక్రోశంగానీ లేదు. మహానుభావుడూ యుగపురుషుడూ - ధర్మపరుడూ అయిన ఒకనాయకుని అడుగుజాడల్లో నడచి స్వాతంత్ర్యసమరాన్ని నడిపినవారే అధికారంలోకి వచ్చేసరికి ఎల్లా ధర్మవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నదీ వివరించి చెప్పారు.

అందుకు పరిష్కార మార్గాలు సూచించారు. నేను నాపశ్చాత్తాపాన్ని తెలిపి క్షమాభిక్ష వేడుకొని అన్నగారు చెప్పిన మాటలే మరల మరల మననం చేసుకొని ఆ పవిత్రభావాలతో నాహృదయాన్ని క్షాళనం చేసుకొన్నాను.

మా మెయిలు సాయంకాలానికి గమ్యస్థానాన్ని చేరింది. వైజాగ్‌లో నాకేర్పాటయిన బసకు పోదామన్నాను. వారు కాదు మేం- టర్నరు సత్రానికి పోతామన్నారు. నేనూ వారిని అనుసరించాను.

వారు లోపలగదిలో సామాను సద్దుకొంటూఉంటే నేను సత్రానికి వెనుకవైపు చిన్నతోటలో పచార్లుచేస్తూ కాలం గడిపాను కొంతసేపు.

చీకటికోణాల్లో బడలికతో ఒడలు తెలియకపడియున్న మానవకోటిని తన లేత హస్తాలతో తట్టి నిద్రలేపి పనులలో ప్రవేశపెట్టి వెలుగుబాటనుచూపి బద్ధకస్తులనుచూచి మధ్యాహ్నంలో కొంత కోపగించి తీక్షణదృక్కులతో అదలించి చివరకు ప్రసన్నుడై పశ్చిమదిక్కుకుచేరాడు గగనగామియైన సూర్యభగవానుడు. లేశమైనా కృతజ్ఞతచూపక - నమస్కారమైనాచేయని అనార్యులనుచూచి అతడు అవమానితుడై - జేవురించినవాడై - ఎఱ్ఱనై - విశాలమై - పెద్దనెత్తుటి మరకలా పశ్చిమాన కొండలవెనుకగా బాధతో కృంగి అంతర్ధానమయ్యాడు.

అదృశ్యాన్నే చూస్తూ కొంతకాలంగడిపేసరికి నా హృదయం - భయంతో బాధతో కంపించింది.

నిస్వార్థుడైన ఆ త్యాగజీవి, - ఆ లోకబాంధవునిగురించే చాలా సేపు ఆలోచించాను. అంతలో అన్నగారు జ్ఞాపకం వచ్చి లోపలకువెళ్ళి వదినగారి జబ్బు విషయమై చెప్పమని మరీమరీ అడిగాను. చెప్పడానికేముంది - అంటూనే వారు నాకు వివరంగా చెప్పక తప్పిందికాదు.

మొదట ఆవిడకు కడుపులో ఏదో నొప్పి బయలుదేరింది. మొదట గుర్తించలేదు. తరువాత (ఖర్చు తక్కువకదా అని అయివుంటుంది) నాటువైద్యాలు చేయించారు. అవేవీ లాభంలేదని తేలినతర్వాత ఆవిడను తీసుకొని అన్నగారు మద్రాసు వెళ్ళారు. అక్కడ వారిని ఆదరించినపాపాన పోయిందెవరూ? ధనమో పలుకుబడో లేక పట్నాలలో పనులు ఎలా అవుతాయీ? వారు ఏదో చూసి "ఏంలేదు పొమ్మ"న్నారు. మద్రాసునుండి తిరిగివచ్చిన కొన్నాళ్లకు తెలిసిన డాక్టరు ఒకాయన స్వయంగా శ్రద్ధ తీసుకొని ఉచితంగా 'ఎక్స్‌రే' ఫొటో తీస్తే అసలు సంగతి బయటపడింది. అల్సరు ఉంది. బాగా ముదిరింది." వీలైతే విశాఖపట్నం వెళ్లండి" అన్నారట.

ఆమాటమీద వారు ఇంతదూరంవచ్చారు. వారా విషయం చెప్పాక అల్లాగా అంత దూరం ముదిరేదాకా ఏం చేస్తున్నారండీ అని సమాధానాన్ని కాంక్షించలేదు గనుక మళ్ళీ 'సరే లెండి' అని నేనే అన్నాను.

అల్లా అని దొడ్లోకివెళ్లి ముఖం కడుగుకొని ముస్తాబై బయలుదేరాను. వార్డులో చూడవలసిన వైద్యుల్ని ఇళ్లవద్దే కలుసుకొని కాస్త పరిచయాలు చేసుకొని వద్దామని అసలు ఉద్దేశ్యం నాది. నేను తీరా బయలుదేరే సమయానికి అన్నగారు నా అభిప్రాయాన్ని ఎల్లా పసిపట్టారో ఏమో ఆ విషయాన్ని ఎత్తుతూ "తమ్ముడూ నువ్వా ప్రయత్నం ఏమీ చెయ్యకు. మీ వదినగారు అందుకు ఒప్పుకోదు. మేం ఇంతకు పూర్వమే ఒక నిర్ణయానికి వచ్చాం....ఆ రెండూ లేనివాళ్లు ఏం చేస్తున్నారో ఎల్లా తంటాలు పడుతున్నారో మేమూ అల్లాగే అవస్థపడతాం. అటువంటివాళ్లు లక్షోపలక్షలు. వాళ్లకుమించిన సుఖసదుపాయాలు నాకు చేదు. నాయందు నీకు ప్రేమ ఇంకా ఏమైనాఉంటే నీవీ ప్రయత్నం మానెయ్" అన్నారు. వారు ఇంకా ఇల్లా అన్నారు.

"మనకు నిజంగా ఎంత అవసరమైనా - అధర్మాన్ని ప్రోత్సహించకూడదు. నేనా విషయాన్ని వార్ధాలో 'వారు' స్వయంగా చెప్పగా నేర్చుకున్నాను...అది అల్లా ఉంచు...అసలు ఇక్కడకు మేం వచ్చింది పెద్ద ఆసుపత్రి వైద్యానికి కాదు. ఆశ్రమంలో ప్రకృతివైద్యం చేయించుకోడానికి."

అక్కడ ఉన్న ఆశ్రమానికీ వీరికీ ఉన్న పరిచయం తెలుసు నాకు. వారికి వైద్యం ఉచితంగా లభిస్తుంది. అందుకనే వారు దాన్ని ఎంచుకొన్నారు. వారా విషయం తేల్చి చెప్పేసరికి నాకు బాధకలిగింది. సాయపడవచ్చు కదా అన్న ఆశ భగ్నమైపోయింది. అన్నగారితో వాదించి వారిని మార్చడం అసంభవం అని నాకేనాడో అవగతమైంది. ఆయన చెయ్యబోయే పిచ్చిపనికి కోపం - జాలీ కలిగాయి. సాయం నిరాకరించారని కోపం - అయ్యో ఇదేమా అన్న జాలీకలిగి నాలో- నా హృదయంలో ఎదురుబదురుగా ప్రవహించి వచ్చి ఒకతావున రెండుప్రవాహాలు ఢీకొని ఉధృతంగా ఉవ్వెత్తుగా పైకి లేచినట్లుగా ఆ రెండుభావాలు ఒకదానినొకటి ఎదుర్కొని ఆందోళనను రేకెత్తించాయి.

"అన్నగారూ - అంతేనా - మీ సిద్ధాంతంకొరకు వదినగార్ని..." అని ఉద్వేగం చేత ఆపైనమాటలు రాక ఆగాను.

"అదేంకాదు తమ్ముడూ - నువ్వేమీ ఆందోళనపడకు" అన్నారాయన చిరునవ్వు నవ్వుతూ.

కాకపోవడమేమిటి! అది అంతే ఆనాడు పరాయివాళ్లను పారద్రోలడానికి ఆముసలాయన చెప్పినమాట ప్రకారం తను-త్యాగం చేశాడు. ఈనాడు తనవాళ్ళను సరిదిద్దడానికి భార్యను బలిదానం చెయ్యడానికి సిద్ధమయ్యారు.

ఇంకఆయన ముందునిలబడలేకపోయాను.

నా హృదయంలోరేగిన తుఫానును అరచేత్తో అదిమిపెట్టుకొని తలవంచుకొని ఆయన్నువిడిచి - ఆ సత్రంవిడిచి కొన్ని గజాలు బిరబిరా, కొన్ని గజాలు మెల్లమెల్లగా నడచి - నడువలేకనడచి బయటకు వచ్చేశాను.

గేటుబయటకువచ్చాక నా హృదయం ఒక్కసారి బావురుమంది.

ఎంతోసేపటికి కాస్త తమాయించుకొని - సర్దుకొని "అబ్బే ఈమనిషితో ఇంతే" అనుకొని అడుగు ముందుకు వేశాను.

"అన్నగారు చేసిన త్యాగం అంతా వృథా వృథా. ఆయనకేమీ లాభం కలుగలేదు కలుగచేసుకోలేదు - నేనేం చేస్తాను" అనుకొంటూ తప్పనిసరై నా బసకు దారితీశాను.

★